

# 'ప్లాట్లు' అమ్మబడును

డా॥ గాయత్రీదేవి

''వచ్చింది, వచ్చింది'' అంటూ ఉత్సాహంగా అరుస్తూ ఇంట్లోకి వచ్చాడు విశ్వనాథం.

''ఆс! మనింటికి 'మీ టివి' యాంకర్ వచ్చిందా? పట్టు చీర పట్టుకొచ్చేసిందన్నమాట! నాకు తెలుసు. అందుకే మీటివి ఛానెల్ ముందే పెట్టి ఉంచేశా.'' అంది ఉత్సాహంగా వంటింట్లోంచి పరుగెత్తుకు వచ్చిన విశాలాక్షికి, హాల్లో భర్త విశ్వనాథం తప్ప మరెవ్వరూ కనబడలేదు.

''వారపత్రిక వచ్చేసింది. అందులో కామెడీ కథల పోటీ ప్రకటనా వచ్చేసింది.'' అంటూ సంబరంగా పుస్తకం చూసుకుంటూ కూర్చున్నాడు విశ్వనాథం.

''పెళ్ళయిన నాటి నుండి చూస్తున్నాను. ఇప్పటికి ఒక్కటంటే ఒక్క కథ రాయలేదు. ప్రతిసారీ కథలపోటీ ప్రకటన మాత్రం చూస్తారు. ఎంతసేపు ఈ పోటీ ప్రకటనలు చూస్తూ కూర్చోకపోతే, మనకో ప్లాటు కొని పడేద్దాం అన్న ధోరణి లేదు. నిన్న కాక మొన్న ఉద్యోగంలో చేరిన కుర్రకుంకలంతా పెద్దపెద్ద ఇళ్ళు కొనేస్తున్నారు. రేపో మాపో రిటైరయ్యే మీరు మాత్రం ఒక్క గజం నేలయినా కొనలేదు. ఓ యింటిదాన్నయ్యే యోగం నా మొహానికి ఉందో లేదో..'' ఏడుపు గొంతుతో దండకం మొదలెట్టి ముక్కు చీదింది విశాలాక్షి.

''అలా ఏడవకే. నీ ఏడుపు వింటే ఎవరయినా అపార్థం చేసుకుంటారు. 'మంచిప్లాటు' కోసం చూస్తున్నా. దొరకగానే ప్రైజు కొట్టే కథ రాస్తా. ప్రైజు మనీతో ఇంటిపని మొదలెడతా.''

''ఇలా మాటలతో కోటలు కట్టడమే ఈ అద్దె కొంప మీకు కథలు రాయడానికి అచ్చి రావడం లేదండీ. కొత్త 'ప్లాటు'లో ఖచ్చితంగా మీ కథకి మంచి ప్లాటు దొరుకుతుందని నా మనసు చెబుతోంది'' తన వాక్చాతుర్యం ప్రదర్శించి, భర్త మనసు మార్చాలని, విశాలాక్షి ఆశ.

''హబ్బే కథ రాసి ప్రైజు కొడితే కానీ గృహయోగం లేదోయ్. నువ్వు నాకేదయినా మంచి ప్లాట్ చెప్పు. కథ రాసేసి, నువ్వన్నట్లుగా ఇల్లు కొట్టేస్తా.''

విశాలాక్షి బుట్టలో పడలేదు విశ్వనాథం.

''అన్నట్లు చెప్పడం మర్చిపోయానండోయ్. మధ్యాహ్నం ఎవరో ఫోన్ చేశాడండోయ్. ఇంటికొచ్చి మరీ ప్లాట్లు అమ్ముతాట్ట. మీరు ఇంటి దగ్గరుంటారని ఈ టైముకి రమ్మన్నాను.'' అంది విశాలాక్షి.

''ఎంత మంచి మాట చెప్పావు. మారేకాలంతో మార్కెటింగ్ పద్ధతులు కూడా మారిపోతున్నాయ్'' అని విశ్వనాథం చెప్పేలోపుగానే విశాలాక్షి వంటిట్లోకి వెళ్ళిపోయింది.

కాలింగ్ బెల్ మోగింది.

విశ్వనాథం వేగంగా వెళ్ళి తలుపు తీసి, పెద్ద పెద్ద ఫైళ్ళూ, బ్యాగులతో గుమ్మంలో నిలబడ్డ వ్యక్తిని, వినయంగా లోపలికి ఆహ్వానించాడు.

ఆగంతకుడు అతి వినయంగా విశ్వనాథానికి నమస్కరించి, లోపలికి వచ్చి, సోఫాలో కూర్చున్నాడు.

విశ్వనాథం ఆతృతకి సరిపోయినట్లుగా ఆగంతకుడు నేరుగా విషయంలోకి వచ్చేశాడు.

''మేడమ్‌గారు మీకు నా విషయం చెప్పి ఉంటారు. నేను ఈ బిజినెస్‌లో ఇరవై ఏళ్ళనుండీ ఉన్నాను. ఇది నాకు వృత్తే అయినా ఎంతో సేవాభావంతో చేస్తున్నా. ఎవడికి ఎటువంటి ప్లాటు కావాలంటే అటువంటిది ఏర్పాటు చేసి, కస్టమర్లని ఆనందింపచేయడమే నా ధ్యేయం.''

''మీ గురించి ఇన్నాళ్ళూ తెలియకపోవడం నా దురదృష్టం'' అన్నాడు విశ్వనాథం తెగ ఇదయిపోతూ. ''మా ఆవిడకేమో 'ప్లాటు' కొనాలని కోరిక. నా మనసేమో ప్లాటుమీదుంది. ప్లాటు దొరికితేనే కానీ, ప్లాటు ప్రశ్నేలేదని చెప్పేశా మా ఆవిడకి.''

''మీకు ప్లాటు కావాలా, ప్లాటు కావాలా?'' –'ఆటకావాలా? పాల కావాలా' అన్న తీరులో విశ్వనాథాన్ని అడిగాడు ఆగంతకుడు.

''ప్లాటే..'' అన్నాడు.

''మీ ఆలోచన సరయినదే. ప్లాటుకి ఉన్న వాల్యూ ప్లాటుకి ఉండదు.

ఆ మాటలు విశ్వనాథానికి వీనుల విందుగా తోచాయి. ''మీరు నాతో ఏకీభవిస్తున్నారు. చాలా సంతోషం. ఈ రంగంలో ఉన్న వారూ, దాని విలువ తెలిసిన వారూ కనక మీరు సరిగ్గా చెప్పారు'' ఆనందంగా అన్నాడు విశ్వనాథం.




అంతటి ఆనందంలో కూడా – ''నా మనసుని కంట్రోల్‌లో పెట్టుకోవాలి. ఈ రోజుల్లో అందరూ మోసగాళ్ళే. అమ్మేవాడికి కొనేవాడు లోకువ. ఏమరుపాటుతో ఉన్నానంటే ఏదో పనికిమాలిన ప్లాటు అంటగట్టేస్తాడు. జాగ్రత్తపడాలి.'' అనుకుని –

''చూడండి ప్లాటు రావుగారూ..''

''మీకు నా బిరుదు గురించి కూడా తెలిసిపోయిందే..''

''నేను రచయితనండీ..'' అంటూ విశ్వనాథం కాలరెగరేశాడు.

''మీ కథలు ఏ పత్రికలో వచ్చాయండీ..''

''ఇంకా రాయలేదు. మీలాంటివారి ప్రోత్సాహం ఉంటే, త్వరలో రచయితనయిపోతా..''

''నాదేముందండీ, ఏదో ప్లాట్లు అమ్ముకునే వాణ్ణే కానీ, సాహితీ వేత్తని కాను కదా..''

''వస్తువు తయారవ్వడానికి ముడి సరుకు ప్రధానం కదా. ఇంతకూ మీ దగ్గర ప్లాట్లు కొన్న ప్రముఖరచయితలు..'' అంటూ ఆగాడు విశ్వనాథం.

''యండమూరి, మల్లాది, యద్దనపూడి, ఉషశ్రీ గారు..''

''పెద్ద పెద్ద రచయితలే కొన్నారే.''

''నా దగ్గర ప్లాట్లు కొన్నాక వాళ్ళకి బాగా కలిసొచ్చింది. 'వాస్తు' సరిగ్గా చూసి ప్లాట్లు ఇచ్చినందు వల్లనే తమకి బాగా కలిసొచ్చిందని వారందరూ నన్ను తెగపొగుడుతూంటారు.''

''ప్లాటుకి కూడా వాస్తు ఉంటుందా?''

''ప్లాటేకదా ప్రధానం. ప్లాటుకి వాస్తు సరిగ్గా ఉంటే జీవితంలో ఇంక దేనికీ ఢోకా లేదు. నా దగ్గర ప్లాట్లు కొన్నవారికి 'పద్మశ్రీ' అవార్డులు కూడా తన్నుకుంటూ వచ్చాయి.''

''ప్లాట్ల విషయంలో మీకున్న అనుభవం నాకు లేదు. మీరే మాం..ఛిది చూసి ఇవ్వండి. నేను మామూలుగా ఎవర్నీ నమ్మను. మీమీద నాకు గురి కుదిరింది. నా మాటగా నేను చెప్పేది ఒక్కటే. మీరిచ్చే ప్లాటు నాకు ప్రైజు తేవాలి. మీరు ఆ గారంటీ ఇస్తే చాలు.''

''ఈ వారంలో బుక్ చేసుకున్న వారందరికీ బహుమతులు గారంటీ. ఆపైన అదృష్టం కలిసొస్తే ఫస్ట్ ప్రైజు కూడా రావచ్చు. మీ దంపతుల నక్షత్రాలు చెప్పండి. మీకు వాస్తు ప్రకారం సరిపోయే ప్లాటు ఇస్తాను.''

''మీకు జ్యోతిషం కూడా..''

''ఈ రంగంలో ఉన్నాక దీనికి సంబంధించిన విషయాలన్నీ తెలుసుకోవాలి. టివి ఛానల్స్ వచ్చాక వ్యాపారంలో పోటీ పెరిగిపోయింది.''

''అవున్లెండి. ఇదివరకు కేవలం పత్రికలే ఉండేవి. ఇప్పుడు బోలెడు ఛానెల్స్ వచ్చేశాయి కదా. దాంతో మా

ప్లాట్లకి డిమాండ్ పెరిగిపోతుంది. అమ్మేవారూ, కొనేవారూ కూడా ఎక్కువయిపోతారు కాదా..'' అంటూ తను జాతక చక్రాలు, ప్లాటు రావు చేతిలో పెట్టాడు విశ్వనాథం.

ఓ చేతిలో చక్రాలు పట్టుకుని, మరో చేతివేళ్ళతో లెక్కలు వేస్తూ ఓసారి శూన్యంలోకి చూసి, కళ్ళు మూసుకుని, ''ఆc..మీకు నల..భై.. ఐదో నెంబరు ప్లాటు సరిగ్గా నప్పుతుంది'' అన్నాడు ప్లాటు రావు.

''ఏ ప్లాట్‌కి ఏ నంబరో మీకు అంత బాగా గుర్తుంటుందా..'' ఆశ్చర్యపోయాడు విశ్వనాథం.

''కళ్ళు మూసుకుంటే ప్లాట్లన్నీ కళ్ళ ముందుంటాయి.''

''వాటే మెమరీ వాటే మెమరీ..'' అన్నాడు విశ్వనాథం ధర్మవరపు సుబ్రహ్మణ్యం స్టయిల్లో.

''ఇక మీరు పేమెంటిస్తే.. బుక్ చేసేస్తాను.''

''ఎంతిమ్మంటారు.''

''ఐదువేలు. ఇది ఈవారం బుక్ చేసుకునేవాళ్ళకి స్పెషల్ రేటు.''

''ప్లాటుకే ఐదువేలా? ప్రథమ బహుమతి వస్తే ఆరువేలొస్తుంది.

ఈ మాట పైకంటే కక్కుర్తిగాణ్ణి అనుకుంటాడేమో.. కథల ఆరంగేట్రానికి ఈ మాత్రం ఖర్చుపెట్టకపోతే ఎలా..'' అని మనసులోనే సర్ది చెప్పుకుని, గదిలో బీరువాలోంచి డబ్బు తేవడానికి వెళ్ళేసరికి, చేతిలో ఐదువేల కట్టతో సిద్ధంగా ఉంది విశాలాక్షి.

''అర్థాంగి అంటే నీలా ఉండాలి. నేను చేసే పనులని నువ్విలా ప్రోత్సహిస్తుంటే నేన..లా..ముందుకు దూసుకుపోతాను.'' అంటూ భార్య చేతిలోని డబ్బు కట్ట అందుకుని ప్లాటు రావు చేతిలో పెట్టాడు విశ్వనాథం.

''ప్లాటు రావు, బ్యాగు తెరిచి, డబ్బు లోపల పెట్టుకుని, ఈ కాయితం మీద ఏదోరాసి, దాన్ని అందమయిన కవర్లోపెట్టి, విశ్వనాథానికి అందించబోతూంటే..

''ఈ రోజు ఈ ప్లాటు కొన్నానంటే, అదంతా నా అర్థాంగి చలవే. మా విశాలాక్షి చేతిలో పెట్టండి.'' అన్నాడు విశ్వనాథం.

కవరు విశాలాక్షికి అందించాడు ప్లాట్‌రావు, కళ్ళకి అద్దుకుని పుచ్చుకుంది విశాలాక్షి.

''ఇక ఈ ప్లాటు నా స్వంతమే కదా. ఇంకెవరికీ ఇవ్వకండి. రేప్పొద్దున్న నాకు ప్రైజు వచ్చాక, ఈ ప్లాటు నాదంటూ కేసులూ, లిటిగేషన్లూ ఉండకూడదు. రిజిస్ట్రేషన్ పక్కాగా వుండేలా చూడండి..'' అని మరోమాటు గుర్తు చేశాడు.

''నా దగ్గర ప్లాట్లు కొన్న వారిలో ఒక్ఖరికి కూడా ఎలాంటి సమస్యా రాలేదు. మీరు నామీద భారం వేసి నిశ్చింతగా ఉండండి.'' తన స్లోగన్ మరోమారు చెప్పి నిష్క్రమించాడు ప్లాటు రావు.

వేం..ఠనే తను ఎన్నేళ్ళుగానో దాచిపెట్టుకున్న తెల్లకాయితాలూ, కొత్త పెన్నూ తెచ్చి టేబుల్ మీద పెట్టి కుర్చీలో కూర్చుని, ''ఆ ప్లాటు కవరు ఇలా ఇవ్వవోయ్. ప్రైజు గారంటీ అంటున్నాడు కదా. ఏదో కొత్త ప్లాటే ఇచ్చి ఉంటాడు. ఓమాటు చూసి, కథ మొదలెట్టేస్తాను.'' అంటూ విశాలాక్షి ఇచ్చిన కవర్ని సున్నితంగా పట్టుకుని, నిదా..నంగా తెరిచి, ఏదో అద్భుతాన్ని చూడబోతున్న ఆనందాన్ని మొహం నిండా నింపుకుని, అందులో ఉన్న కాయితాన్ని స్లో మోషన్‌లో పైకి తీశాడు.

''మీనాక్షి హౌసింగ్ సొసైటీ, మంగళగిరిలో ప్లాటు నంబరు నలభై ఐదు కొనడానికిగాను చెల్లించిన అడ్వాన్సు మొత్తం ఐదు వేలూ ముట్టినవి..'' చదివిన విశ్వనాథం మొహంలోని భావాలు, శివాజీ గణేశన్ మొహంలోలా త్వర త్వరగా మారిపోయాయి.

''వీడెవడో నిరక్షర కుక్షిలా ఉన్నాడు. 'ప్లాటు' అంటే అర్థం తెలియదులా ఉంది. మనం కొంటామన్న 'ప్లాటేమిటీ. వీడు మనకి అమ్మిన ప్లాటేమిటీ.. గోల్‌మాల్ అయింది. వాడికి ఫోన్ చెయ్యి. వెంటనే వచ్చి, బుకింగ్ కాన్సిల్ చెయ్యమను.''

విశాలాక్షి ముసి ముసి నవ్వులు నవ్వింది. ప్రజలందరి దృష్టిలోనూ ప్లాటంటే ఇంటిస్థలమే. అతను ఇళ్ళ స్థలాలు అమ్మడానికే వచ్చాడు. ఈ విధంగా ఇన్నాళ్ళకి మనక్కూడా ఓ ప్లాటు అదే స్థలం కొనుక్కునే యోగం పట్టింది. ఈ బుకింగ్ కాన్సిల్ చేసే ప్రశ్నే లేదు. అయినా ఇలా ఇళ్ళకొచ్చి కథల ప్లాట్లు అమ్ముతారని మరెలా అనుకున్నారండీ..'' అంటూ ప్లాట్ రావు ఇచ్చిన కవర్ని భద్రంగా దాచడానికి లోపలికి వెళ్ళిపోయింది.

విశ్వనాథం మనసు అరగంట వెనక్కి వెళ్ళింది. ప్లాట్ రావుతో జరిగిన సంభాషణలన్నీ మళ్ళీ వినబడ్డాయి. బుర్ర పాదరసంలా పని చెయ్యడం మొదలెట్టింది. అంతక్రితం మొహంలో మారిన భావాలన్నీ మళ్ళీ గబగబా మారిపోయాయి.

''వచ్చేసింది. వచ్చేసింది.'' అని ఉత్సాహంగా అరుస్తూ గంతులేసినంత పని చేశాడు.

''మీటివి' యాంకరా, ఎక్కడా..'' అంటూ పరుగెత్తుకొచ్చింది విశాలాక్షి.

''నాకు ప్లాటు వచ్చింది. నలభై ఐదవ నంబరు ప్లాటు వాస్తు ప్రభావం అప్పుడే కనిపించేస్తోంది. నీకు కావలసిన ప్లాటు డబ్బు పెట్టి కొంటే, నా కామెడీ కథకి కావలసిన ప్లాటు ఫ్రీగా, బహుమతిగా వచ్చేసింది. నా కథ పేరు 'ప్లాట్లు అమ్మబడును.'' అంటూ రాయడానికి ఉపక్రమించాడు విశ్వనాథం.

★



## రామ్ స్టుపిడా? కాదు...

కత్రీనా భలే కతర్‌నాక్‌గా మాట్లాడ్తుంది. మాటల్లో రామ్‌గోపాల్‌వర్మ సంగతొస్తే.. తనకి షోలేలో తమిళ బ్రాహ్మణ వితంతువు పాత్ర యిచ్చినప్పుడు వేయాలా వొద్దా అని తెగ యిదయిపోయిందిట. ఆ! తనని మాత్రమే ఆ పాత్రకి సెలెక్ట్ చేశాడంటే రామ్ స్టుపిడ్ కాదుగా అని చివరికి తనకి తనే ధైర్యం చెప్పుకుందట. అమ్మో యింకా వినండి ఏం చెప్తుందో! తెలుగులో మల్లీశ్వరి పెద్దహిట్ అంటూ బొంబేలో టాంటాం చేసుకుంటోందీ పిల్ల. ఫట్‌మన్న అల్లరి పిడుగునేమో 'బాగానే పోయిందే' అంటూ వొళ్లు తిప్పుతుంది. అదేమిటి మీరు చెప్తోందంతా అబద్ధం అని అన్నారో కోపంతో వూగిపోతుంది. 'నిజం తెలిసుకొని మాట్లాడ్డం నేర్చుకోండి.' (స్టుపిడ్) అంటూ కారాలు నూరుతోంది. మల్లీశ్వరి మరీ ఆశలదోశెల పందిర్లేసేసుకుంటున్నట్టు లేదూ?